

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

### 2015-జనవరి

గృహ ప్రవేశం అయిపోయి దాదాపు ఆరు నెలలు కావస్తూ వున్నా, ఇల్లంతా ఇంకా కొత్త పెయింటు వాసన వేస్తూనే వుంది. అందరికీ ఇల్లు అలవాటయీ కానట్టు వుంది. ఆ రోజే, ఇంకొక చిన్న గ్రూపుని మధ్యాహ్నం భోజనానికి ఆహ్వానించారు. అతిథులంతా వెళ్ళిపోయిన తరవాత అలసటగా సోఫాలో కూలబడింది భాను.

అశోక్ అతిథులు తెచ్చిన బహుమతులు జాగ్రత్తగా పక్కన పేరుస్తున్నాడు.

"ప్రతీ ఒక్కళ్ళకీ మరీ మరీ చెప్పాను, బహుమతులు తేవొద్దని. ఒక్కళ్ళన్నా పట్టించుకుంటేగా! ఇప్పుడీ సామానంతా ఎక్కడ పెట్టాలో అర్థం కావడంలేదు," చిరాగ్గా అన్నాడు.

అనఘ ప్లేటులో కేకు ముక్క పెట్టుకోని వచ్చింది.

"అనఘా, ఇప్పుడంత కేకు తింటే రాత్రికి భోజనం చేస్తావా? అవసరమా ఇప్పుడా కేకు?" భానూ కసిరింది.

స్పూను నోట్లో పెట్టుకోబోతున్న అనఘ మొహం చిన్నపోయింది.

"అబ్బ, వదిలేయ్ భానూ. రాత్రి భోజనం ఒక్క పూట మిస్సయితే ప్రపంచం మునిగి పోదు! పిల్లలతో కొంచెం పట్టూ విడుపూ వుండాలి. అన్నిటికీ వాళ్ళని క్రిటిసైజ్ చేయకు! నువ్వు తిను నాన్నా!" చేతిలో పని వొదిలేసి కూతురి పక్కకొచ్చి కూర్చున్నాడు అశోక్.

" నాన్నా, నేను చైతన్యతో చెప్పేసా, ఇంటర్మీడియెట్‌లో సైన్సు చదవనని. ఆర్ట్స్ సబ్జెక్ట్స్ చదువుతా!" రాకింగ్ చెయిర్‌లో ముందుకీ వెనక్కీ వూగుతూ అన్నాడు భార్గవ్.

"యేమిటీ? ఆర్ట్స్ చదువుతావా?" లేచి కూర్చుంది భాను.

" ఆ సంగతి మాకంటే ముందు చైతన్యతో చెప్పావా?" అశోక్ ఆశ్చర్యపోయాడు.

"మీ ఇద్దరికీ కూడా బోలెడు సార్లు చెప్పా."

"ఆ చెప్పడం వేరు. నిర్ణయం కూడా తీసేసుకున్నావా?" భాను కోపంగా అంది.

"నా చదువు విషయంలో నిర్ణయించుకునే హక్కు నాకుందా లేదా? అది తేల్చు ముందు!" పదిహేనేళ్ళ భార్గవ కోపంగా అన్నాడు.

"ఇప్పుడు వాదనకి నాకు ఓపిక లేదు భార్గవ్! తరవాత మాట్లాడదాం," భాను లేచి వెళ్ళబోయింది.

"తర్వాతంటే యెప్పుడు? ఏదో ఒక కోచింగ్ సెంటర్‌లో ఫీజు కట్టేసిన తరవాతా? అప్పుడు మాట్లాడడానికి యేమీ వుండదు,బ్లాక్ మెయిలింగ్ తప్ప!"

"బ్లాక్ మెయిలింగా?"

"కాదా మరి? డబ్బు కట్టేసిన తరవాత ఇంకేమంటారు? యెంతో కష్టపడి సంపాదించిన డబ్బు, ఎలాగో ఒకలా రెండేళ్ళు కష్టపడి చదువు అంటూ బ్లాక్ మెయిలింగే కదా? అందుకే చెప్తున్నా, నాకు ఇంజినీరింగూ,మెడిసినూ చదువులు వొద్దు. ఇంటర్మీడియెట్లో ఆర్ట్స్ సబ్జెక్టు చదువుకొని, ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేస్తాను!"

"ఆ తరవాత అడుక్కొని తింటావు!" భాను కంఠం పెద్దదైంది.

"భానూ! అంతంత మాటలెందుకు! కాం డవున్!" అశోక్ వారించాడు.

"భార్గవ్! నిన్ను యెక్కడ చేర్పించినా ఆలోచించకుండా చేయం కదా?" కొడుకుతో అనునయంగా అన్నాడు.

"అఫ్ కోర్స్ ఆలోచిస్తారు! నా గురించి తప్ప మిగతా అన్ని ఫాక్టర్స్ గురించీ ఆలోచిస్తారు! టోటల్లీ యూజ్ లెస్."

"భార్గవ్, మేము ఆలోచించేది నీ భవిష్యత్తు గురించి. ఇప్పుడు యేదో ఫేషనబుల్ మాటల ఫేజ్‌లో పడి చదువుని నిర్లక్ష్యం చేస్తే, ఆ తరవాత యెంత పశ్చాత్తాప పడినా లాభం వుండదు. అప్పుడు మళ్ళీ  మమ్మల్నే తిడతావు!" భాను తీవ్రంగానే అన్నా, కంఠంలో వాల్యూం తగ్గింది.

"అమ్మా! నువ్వు నా మాటలు వింటున్నా అనుకుంటున్నావు కానీ, నీకసలేమీ వినపడడం లేదు. నా మాటలు నీ చెవుల దాకా వెళ్తున్నాయే కానీ, మెదడులోకీ, మనసులోకీ యెక్కటం లేదు. అందుకే నా మాటలూ, ఆలోచనలూ అన్నీ యేదో ఫేషనబుల్ ఫేజ్ అనుకుంటున్నావు. నిజంగా నాకు మల్టీ మీడియా, సినిమా మీద చాలా ఆసక్తి. ఐ థింక్ దేర్ ఈజ్ ఎ లాట్ ఆఫ్ ఫ్యూచర్ ఇన్ దేర్. నాన్నా! నీకైనా నా మాటలు సీరియస్‌గా అనిపించడం లేదా?" నిస్సహాయంగా అన్నాడు భార్గవ్.

"సరేలే, ముందు టెంత్ పరీక్షలకి చదవడం మొదలు పెట్టు. సమ్మర్‌లో ఆలోచిద్దాం కాలేజీ గురించి! ఇప్పుడు వాదనలొదిలేద్దాం!"

"అసలిదంతా నీవల్లే అశోక్. నువ్వు గారాబం చేసి వాళ్ళిద్దరినీ నెత్తికెక్కించుకున్నావు. ఇప్పుడు మన మాట వాళ్ళెందుకు వింటారు?" భాను మాటలకి అశోక్ యేదీ బదులివ్వలేదు.

"వీడికి తోడు వీడి స్నేహితులు. వాళ్ళు వాళ్ళ చదువులు బానే చూసుకుంటారు. వీణ్ణి మాత్రం యేదో మేధావి లాగా యెక్కించి వొదుల్తారు."

"సం ఫ్రెండ్స్ ఆర్ బెటర్ దాన్ నో ఫ్రెండ్స్!" సోఫా ఇంకో మూల నుంచి అనఘ గొంతు వినిపించింది.

"నీ గోలేమిటే? అసలు ముందు ఇంగ్లీషు మానేసి తెలుగులో మాట్లాడు! నీ కొత్త స్కూలు కాదు కానీ మా చావుకొచ్చింది!" భాను మండిపడింది.

"మరి నన్నేం చేయమంటావు? మా స్కూల్లో ఇంగ్లీషే మాట్లాడాలి. ఇంట్లో తెలుగంటే యెలా? స్కూల్లో అసలు నాతో యెవరూ మాట్లాడరు కూడా!"

"అసలింతకీ యేమిటి అనూ నీ ప్రాబ్లం?" అశోక్ సామాన్లన్నీ పక్కన పెట్టి వొచ్చి కూర్చున్నాడు.

"అది కాదు నాన్నా! కొత్త స్కూల్లో గర్ల్స్ ఎంత క్రూయల్‌గా వుంటారో తెలుసా? వాళ్ళల్లో వాళ్ళే మాట్లాడుకుంటారు. నాతో మాట్లాడరు. నేను ఈ ఇయరే చేరాను కదా? అసలు నాతో ఫ్రెండ్‌షిప్ చేయరు. నన్నేదో వింతగా చూస్తారు."

"కొత్త స్కూలూ, కొత్త కాలేజీ, కొంచెం టైం పడుతుంది మరి అందరికీ అడ్జస్ట్ కావడానికి." అశోక్ జనాంతికంగా అన్నాడు.

"ప్లీజ్! ఇవాల్టికి ఇంక ఈ వాదనలూ, చర్చలూ వొద్దు. నాకు చాలా అలసటగా వుంది!" భాను అంది నిస్సత్తువగా.

"చర్చలా? మేం మాట్లాడితే నువ్వు కానీ, నాన్న కానీ అసలు వినడే వినరు. దీన్ని చర్చ అంటారా?" మళ్ళీ కవ్వించాడు భార్గవ్.

లోపల గదిలో తలుపులు దడ దడా వేస్తూ మూస్తున్న చప్పుడు వినిపించింది.

"దేర్ షి గోస్! నానమ్మ కూడా దూరుతుంది ఇప్పుడు ఈ మెస్‌లోకి." అనఘ నవ్వింది.

"అనూ, ప్లీజ్! ఆ కేక్ తిన్న ప్లేటు నాకడం మానేసి దాన్ని సింకులో పడేసిరా. పద, ఇద్దరం కోర్టులోకెళ్ళీ బాడ్‌మింటన్ ఆడుకుందాం కాసేపు. కమాన్, మూవ్!"

సుమిత్ర వొచ్చింది గదిలోకి. "అశోక్! నేను రేపే అమ్మూ వాళ్ళ ఇంటికెళ్ళిపోతాను. ఇక్కడ నాకేమీ బాగలేదు."

"అదేమిటత్తయ్యా? ఇంత పెద్ద ఇల్లు బాగుండకపోవడమేంటి? అమ్మూ వాళ్ళింట్లో ఎంత కాలం వుంటారు?" భాను ఆశ్చర్యంగా అంది.

"నాకు వీలైనన్నాళ్ళు. ఇక్కడ అన్నీ దూరమే! నాతో మాట్లాడేవాళ్ళే లేరు. గుడికి వెళ్ళాలన్నా, డాక్టరు దగ్గరికెళ్ళాలన్నా మీ ఇద్దరినీ బతిలాడుకోవాలి." సుమిత్ర కోపంగా అంది.

"అమ్మా, అక్కడ అపార్ట్‌మెంటులో మాత్రం మన జోలి ఎవరు పట్టించుకున్నారు? ఇప్పుడిక్కడ నీకొచ్చిన ఇబ్బంది యేమిటి?"

"అత్తయ్యా! వచ్చే వారం మిమ్మల్ని ఇక్కడ మా స్నేహితుల ఇళ్ళకి తీసికెళ్తాను. మీకొంచెం కాలక్షేపంగా వుంటుంది."

"అమ్మా, నీకు షాకిచ్చే విషయమొకటి చెప్పనా? నీకు నచ్చే ప్రతీదీ మాకందరికీ నచ్చక్కర్లేదు! ఈ ఇంటికి మారటం నానమ్మకీ, అనూకి నచ్చలేదు.నా చదువు మీ అందరి అభిప్రాయం ప్రకారమే నడవాలనటం నాకు నచ్చటంలేదు. వారానికి యాభై గంటలు నువ్వు పని పేరుతో బయటే గడపడం నాన్నకీ నచ్చటంలేదు. మాకు నచ్చినా నచ్చకపోయినా నీ మాటే నెగ్గించుకుంటావు కాబట్టి మేమందరం నోరు మూసుకుంటాం. దాంతో మేమంతా సంతోషంగా వున్నామని నిన్ను నువ్వు మభ్యపెట్టుకుంటావు. యూ ఆర్ బికమింగ్ డెలూషనల్! "

భాను నిర్ఘాంతపోయింది. పిల్లలు అమ్మా నాన్నలతో వాదులాడటం, అరవడం మామూలే. తన ఇంట్లోనూ అప్పుడప్పుడూ, ఈ మధ్య తరచుగానే జరుగుతున్నాయి. పిల్లలిద్దరూ టీనేజీలోకొస్తున్నారు. తెలిసీ తెలియని వయసు, చుట్టూ ఎంతో తికమక పెడుతున్న ప్రపంచం. అమ్మా నాన్నల అభిప్రాయాలూ, క్రమ శిక్షణా వాళ్ళని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్టుంటాయి.

ఇవన్నీ తనూ అశోక్ మాట్లాడుకుంటూనే వుంటారు. యూనివర్సిటీలో విద్యార్థులతో కలిసి మెలిసి తిరుగుతాడేమో, అశోక్ పిల్లలతో చనువుగా, జెంటిల్‌గా వుంటాడు. తల్లిగా తను కొంచెం క్రమశిక్షణలో వుంచడానికి ప్రయత్నిస్తుంది. దాంతో ఘర్షణలు జరుగుతూనే వున్నాయి. కానీ తనతో ఇంత కచ్చగా భార్గవ్ మాట్లాడడం ఇదే మొదలు.

"భార్గవ్, అమ్మతో అలాగేనా మాట్లాడేది? సే సారీ టు హర్. మనందరికోసం అమ్మ ఇరవై నాలుగు గంటలు కష్టపడుతుంది. హేవ్ సం రెస్పెక్ట్ ఫర్ హర్!" ఎప్పుడూ లేనిది తండ్రి మొహంలో కోపం చూసి భార్గవ్ బెదిరిపోయాడు.

"అయాం సారీ, అమ్మా! ఐ డింట్ మీన్ ఇట్!" మెల్లిగా లేచి లోపలికెళ్ళిపోయాడు.

అనూ భాను మెడ చుట్టూ చేతులేసింది.

"అమ్మా, పద, లెటజ్ గో. బాడ్‌మింటన్ ఆడి, తరవాత ఐస్‌క్రీం తినొద్దాం."

★★★★★★★★★★★★★★★★★★★

తల నొప్పిగా అనిపించి వంటింట్లోకెళ్ళి కొంచెం కాఫి కలుపుకొని తెచ్చుకొని బయట వరండాలో కూర్చున్నాడు అశోక్. అంతకు క్రితం వారమే ఎమ్మే విద్యార్థులతో జరిగిన "సెల్ఫ్–డిటర్మినేషన్" గురించిన చర్చా, వాదోపవాదాలూ గుర్తొచ్చాయి. ముందు నెమ్మదిగా మొదలైన చర్చ, అర గంట గడిచేసరికి వాదనగా పదును తేలింది.

"సెల్ఫ్–డిటర్మినేషన్" ఒక దేశాలకూ రాష్ట్రాలకు మాత్రమే కాదు, వ్యక్తులకూ, వ్యవస్థలకీ కూడా వర్తించాలనీ వాదించాడు ఆఖరి బెంచీలో కూర్చునే శేఖర్.

కానీ, వ్యక్తుల సెల్ఫ్–డిటర్‌మినేషన్‌ని చుట్టూ వున్న పరిస్థితులూ, సమాజమూ బంధిస్తాయని వాదించాడు ముందు బెంచీలో కూర్చునే నిఖిల్. క్లాసులో విద్యార్థులు చర్చించుకునేటప్పుడు అతనెప్పుడూ కలగజేసుకోడు. నవ యువతీ యువకుల ఆత్మ విశ్వాసాన్నీ, వాక్చాతుర్యాన్నీ, వైవిధ్యమైన అభిప్రాయాలనీ కొన్నిసార్లు ఆశ్చర్యంగా, కొన్నిసార్లు గర్వంగా గమనిస్తూ వుంటాడు. స్వయం–నిర్ణయాధికారం గురించి వాళ్ళ అభిప్రాయాల్లాగానే వినిపించాయి ఇవాళ భార్గవ, అనఘా మాట్లాడిన మాటలు. క్లాసులో పిల్లల వాదనలు విన్నంత తేలిగ్గా లేదు ఇంట్లో పిల్లల చర్చలతో నెగ్గుకురావడం!

★★★★★★★★★★★★★★

## 2015- ఆగస్టు

"అశోక్, నాన్న బాత్రూంలో జారి పడ్డారు. కాలు ఫ్రాక్చరయింది. నేను ఆఫీసునుంచి యశోదా హాస్పిటల్‌కి వెళ్తున్నాను. నీకు వీలైతే సాయంత్రం అక్కడికే వచ్చేయి." భాను దగ్గర్నించి మెసేజీ చూసి ఉసూరుమంది అశోక్ మనసు. ఉన్న సమస్యలతోటే ఛస్తూ ఉంటే ఇప్పుడిదొకటా! అసలే భాను! తండ్రికి ఆరోగ్యం సరిగా లేకపోతే ఎంత ఇల్లు పీకి పందిరేస్తుందో! దానికి తోడు ఆ పిల్లలూ, అమ్మా! పోనీ కొన్ని రోజులు భాను తండ్రి ఇంట్లో ఆయన బాగోగులు కనిపెట్టుకొని వుండమంటే సరి! ఇల్లు కాస్త ప్రశాంతంగా వుంటుంది.

హాస్పిటల్ బయటే ఎదురొచ్చింది భాను.

"నాన్నకి ఆపరేషన్ చేయ్యాలిట. ఇప్పుడే యేటీయెం నుంచి రెండు లక్షలు డ్రా చేసి తెచ్చాను. పద, కవుంటర్లో కట్టేద్దాం."

"మన సేవింగ్స్ అకవుంట్లో రెండు లక్షలున్నాయా?" జోక్ చేద్దామని ప్రయత్నించాడు.

"పిచ్చిగా మాట్లాడకు అశోక్. ఎందుకుండవు? అయినా, నాన్న తన అక్కవుంట్లోంచే డ్రా చేయమని తన కార్డిచ్చారు. కాబట్టి ఆపరేషన్ ఖర్చు గురించి నీకే బెంగా అక్కర్లేదు!"

ఎప్పుడు లేనిది భానుకి ఇంత కటువుగా, చిరాగ్గా మాట్లాడడం ఎలా అలవాటయిందో, అనుకున్నాడు అశోక్. డబ్బు కట్టి, అవసరమైన పేపర్ల మీద సంతకం పెట్టి అలసటగా అక్కడే వున్న కుర్చీలో కూలబడింది భాను.

"భానూ, కొంచెం కాఫీ తాగుతావా? కేంటీన్‌కెళ్ళి తీసుకొస్తాను," ఆమె అలసిన మొహం చూసి జాలేసి అన్నాడు అశోక్.

"కాఫీ యేమొద్దు. ఇదిగో మంచి నీళ్ళ బాటిలుందిగా!" బాటిలెత్తి గడ గడా నీళ్ళు తాగింది.

"అశోక్, నాన్నని హాస్పిటల్ నుంచి డిస్చార్జ్ చేసాక మనింటికి తీసికెళ్ళాలి. ఆయన కోలుకోవడానికి కనీసం మూడు నెలలు పడుతుందిట. డాక్టరు చెప్పాడు. మూడు నెలలు ఆయన ఒంటరిగా యే పనీ చేసుకోలేరు. ఒంటరిగా ఎలా వుంటాడు?"

"మనింటికా? యెలా కుదురుతుంది? అసలే నువ్వు వున్న పనితో నలిగి పోతున్నావు. ఇప్పుడాయన పనులు కూడా చేయగలవా?"

"మరింకేం చేయగలం? ఆయనని ఒంటరిగా వుంచడం నాకిష్టం లేదు."

"ఒంటరిగా ఎందుకు? నువ్వూ అక్కడే వుండు, ఆయనకి తోడుగా!" భాను ఆశ్చర్యంగా చూసింది అశోక్ వైపు. తను అమ్మా నాన్నల దగ్గర కనీసం వారం రోజులుంటానన్నా ఒప్పుకునే వాడు కాదు అశోక్.

"అబ్బా, నువ్వు లేకపోతే నాకు పిచ్చెత్తినట్టు వుంటుంది భానూ! ఐ ఫీల్ సో లోన్‌లీ! నీకు వాళ్ళ దగ్గరుండాలనిపిస్తే, వాళ్ళనే వొచ్చి మనింట్లో యెంత కాలమైనా వుండమను. నువ్వు మాత్రం నన్నొదిలి వెళ్ళడానికి వీల్లేదమ్మాయ్!" అనే వాడు నిర్మొహమాటంగా. తామిద్దరూ కొంచెం కొంచెంగా దూరమై పోతూ వున్నారా?

"వుండొచ్చు కానీ, నాకు ఆఫీసుకి చాలా దూరమైపోతుంది అశోక్. చాలా అలసిపోతాను. మన ఇంట్లో అయితే ఒకరికి నలుగురమున్నాం. వొంతులేసుకొని ఆయన పనులు చేయొచ్చు. పిల్లలనొదిలి నేను మాత్రం వుండగలనా?"

"అదీ నిజమే అనుకో! కానీ, మా అమ్మ అమ్మా ఇంట్లో వుండి, మీ నాన్న మన ఇంట్లో వుంటే బాగుంటుందా? అందరూ నీగురించి యేమంటారు?"

తను పెళ్ళాడింది ఈ అశోక్‌నేనా అనుకుంది భాను.

"అశోక్, అత్తయ్యని వెళ్ళమని యెవరూ అనలేదు. ఆవిడే వెళ్ళారు. అసలు ఆవిడ అమ్మా దగ్గర వుండడానికీ, మా నాన్న మన దగ్గర వుండడానికీ ఏం సంబంధం? మా నాన్నకి ఇప్పుడు మనిషి అవసరం వుంది. కన్న కూతురిగా ఆ బాధ్యత నుంచి నేను తప్పించుకోలేను. ఒక్క మాటడుగుతాను చెప్పు. మా నాన్న పరిస్థితిలో అత్తయ్య వుంటే, నువ్విలాగే మాట్లాడేవాడివా?"

ఇంకేమీ మాట్లాడలేకపోయాడు అశోక్. ఫెమినిజం గురించి క్లాసులో లెక్చరివ్వడం వేరు, ఇంట్లో ఆడవాళ్ళ అవసరాలను మన అవసరాలతో సమానంగా తీర్చడం వేరు, అనుకున్నాడు.

★★★★★★★★★

ఇంట్లోకి ఇంకో కొత్త మెంబర్నీ, అందులోనూ కాలు విరిగి కదలలేని పేషంటునీ తీసుకొస్తే వచ్చే స్పందనే వొచ్చింది పిల్లలనుంచి. అయితే విచిత్రంగా భార్గవ్ రెండు రోజుల్లోనే కోలుకున్నాడు.

"అమ్మా, తాతయ్యకి స్నానం చేయడంలో నేను సహాయం చేస్తాలే. నువ్వు వేరే పని చూసుకో," అన్నాడు మూడో రోజు. తాతయ్యని బాత్రూంకి తీసికెళ్ళాడం, ఆయన షేవింగ్ ఏర్పాట్లు చూడడం, బట్టలు తీసివ్వడం, ఆయనతో కూర్చుని కబుర్లు చెప్పడం చేసాడు. భానుకి కొంచెం తెరిపిగా అనిపించింది.

తాతయ్యకి వేళకి మందులివ్వడం, ఆయన నిద్ర పోయే టైములో టీవీ వాల్యూము తగ్గించి నిశ్శబ్దంగా వుండడం, ఆయనని క్రమం తప్పకుండా డాక్టరు దగ్గరికి తీసికెళ్ళడం, ఎవరూ నేర్పించకుండానే అందరూ నేర్చుకున్నారు. పైకి ఒక హెల్పరు వున్నా, ఇంటి సభ్యులు తలా ఒక చేయి వేయడంతో వచ్చే మానసిక ప్రశాంతతే వేరు.

"ఒక్కదానివీ ఇంటి పనీ, ఆఫీసు పనీ, పేషెంటు పనీ, ఎంత అవస్థ పడుతున్నావో," అనుకుంటూ సుమిత్ర వచ్చేసింది. అది నిజమే అయినా, ఆవిడా మనవణ్ణీ, మనవరాలినీ చూడకుండా ఎక్కువ రోజులు వుండలేదు.

పద్మనాభం కూడా, పిల్లలతో కలిసి కూరగాయలు కోసిపెట్టడం, అనఘ చదువూ హోంవర్కూ చెక్ చేయడం, లాటివి చేస్తూ వీలైనంత సహాయం చేసాడు. ఆయనకి మొదట్లో కూతురింటికి ఇలా బరువులా వొచ్చి పడడం చలా మొహమాటంగా, ఇబ్బందిగా అనిపించేది. కానీ రెండు మూడు వారాల్లోనే, అలా ఇబ్బందిగా మొహమాటంగా వుండడం కంటే, ఇంట్లో వాళ్ళకి సాయంగా వుండడం మంచి పద్ధతేమో అనిపించింది. కాలు కట్టుతో కదలలేకపోయినా, పిల్లలు వీల్‌చైర్‌లో వంటింట్లోకి తీసికెళ్తే, వాళ్ళతో చిన్న చిన్న పనులు చేయించేవారు. అశోక్‌కి కూడా మామగారు ఇంట్లో వుండడంతో తన వ్యాపకాల గురించీ, రాజకీయాల గురించీ, సమాజంలో వేగంగా వొస్తున్న మార్పుల గురించీ మాట్లాడుకోవడానికి తోడు దొరికింది.

## 2015–డిసెంబరు

"భాను, ఇలా రా!" పిలిచాడు పద్మ నాభం ఆయనకి కాలు పూర్తిగా నయమై పోయింది. తన ఇంటికి తిరిగి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు.

"ఏంటి నాన్నా?" లాప్‌టాప్ లో ఆఫీసు పని చూసుకుంటూ అడిగింది భాను. తనే వొచ్చి ఆమె పక్క కుర్చీలో కూర్చున్నాడు పద్మనాభం. ఆమె చేతిలో చెక్కు పెట్టాడు. చెక్కు ఆశ్చర్యంగా చూసింది భాను.

"ఇప్పుడెందుకీ డబ్బు నాన్నా? నాకే అవసరం లేదు!" ఇబ్బందిగా అంది.

"నీకవసరమని కాదు నాన్నా! ఆగస్టులో నీదీ అశోక్‌దీ పుట్టిన రోజు. వచ్చే వారం మీ ఇద్దరిదీ పెళ్ళి రోజు. రెండిటికీ కలిపి ఇద్దామని అనుకున్నాను. గాజులో, ఇంకేదైనా నగలో కొనుక్కో."

"ఇప్పుడు నాకు నగలెందుకు నాన్నా!"

"ఈ ఇంటికోసం కొన్ని నగలేవో బేంకులో పెట్టి లోన్ తీసుకున్నట్టున్నారు. ఆ లోన్లు తీర్చేసుకో."

"వాటికి నువ్వు డబ్బులివటమేంటి నాన్నా? మేమేదో సర్దుకుంటాం కదా?"

"మరదే నాకు కోపం తెప్పించేది. నాకు అవసరానికి నువ్వు సహాయం చేయొచ్చు కానీ, నీ అవసరానికి నేను చేయకూడదు కదూ?"

"గాజులూ, నగలూ, అవసరాలా?"

"నీకు ఇల్లు కొనుక్కోవడానికి పనికొచ్చాయి కాబట్టి అవి అవసరాలే. పోనీ బంగారం సంగతి వొదిలేయ్, పిల్లల చదువులకోసం దాచుకో. ఇద్దరూ పై చదువులకొస్తున్నారు. చాలా డబ్బు అవసరమవుతుంది."

"వాళ్ళు సరిగ్గా చదివితే చూద్దాంలే."

"అంత మొండిగా మాట్లాడకు భానూ. పిల్లలిద్దరూ బుద్ధి మంతులు. చక్కగా చదువుతున్నారు. నువ్వనుకున్న ఎంపీసీ తీసుకోలేదనేగా నీకు భార్గవ మీద కోపం? వాడు మరీ అంత భవిష్యత్తు పట్టని ఇరెస్పాన్సిబుల్ మనిషి కాదు. వాడనుకున్న కోర్సుల్లో ముందు చేరనీ. నిజంగా వాడు ఆ ఫీల్డులో అసలు పనికిరాకపోతే, అప్పుడు మళ్ళీ ఇంకేదైనా చదువుకోవచ్చు. ఇరవై యేళ్ళకి ఇంజినీరింగు పుర్తి చేసి ఉద్యోగంలో చేరి తీరాలన్న రూలేమీ లేదు. కొంచెం మనసు ప్రశాంతంగా చేసుకోని ఆలోచించు."

తండ్రి మాటలకి ఎదురు చెప్పలేదు భాను. అయన ఇచ్చిన చెక్కు తీసుకొని బాగులో పెట్టుకుంది.

★★★★★★★★★★

## 2016-జనవరి

"అబ్బా, ఆ టివీ శబ్దం కొంచెం తగ్గించు భార్గవ్! ఇది ఇల్లా, వీధిలో టీ కొట్టా?" విసుగ్గా అంది భాను. ఆమె విసుగు పట్టించుకోలేదు భార్గవ్.

"అమ్మా, కొత్త స్పీకర్లు కొన్నాను. బాహుబలి సినిమా సౌండు చూడూ ఎంత బాగా వొస్తుందో! సూపర్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్!" ఉత్సాహంగా అన్నాడు,

"కొత్త స్పీకర్లా? డబ్బులెక్కడివి?"

"తాతయ్య ఇచ్చారు ఏదైనా కొనుక్కోమని. ముందు కెమెరా కొనుక్కుందామనుకున్నా. కానీ కెమెరా అయితే నేనొక్కణ్ణే ఎంజాయ్ చేస్తా. స్పీకర్లైతే అందరమూ ఎంజాయ్ చేయొచ్చు కదా అని స్పీకర్లు కొన్నా." అంతలోకే వాడి మాటలకి ముద్దొచ్చిందామెకి. లోపటి నించి బయటికొచ్చాడు అశోక్.

"సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్సా నా మొహమా? సబ్‌స్టెన్స్ లేకుండా స్టైలు మాత్రమే వుండే ఫైన్ ఆర్ట్ సమాజానికే విధంగానూ పనికిరాదు," భాను దగ్గరికొచ్చి ఆమె లంచి బాక్సు తీసుకొని సింకులో పడేస్తూ అన్నాడు. ఇంటర్‌మీడియేట్ చదువుతూ అన్నీ తనకి తెలుసనుకునే భార్గవ్ తడబడ్డాడు.

"సబ్‌స్టెన్స్, స్టైల్ అంటే యేమిటి నాన్నా?"

"సబ్‌స్టెన్స్ అంటే నువ్వు చెప్పదలచుకున్న విషయం. స్టైల్ అంటే నువ్వు చెప్పే పద్ధతి. కొన్నిసార్లు పెద్ద కథ లేని సినిమాలు కూడా, చెప్పే విధానం వల్లా, సంగీతం వల్లా, ఫోటోగ్రఫీ వల్లా బాగున్నట్టనిపిస్తాయి. కొన్ని సినిమాలు తీసే పద్ధతి సింపుల్‌గా వున్నా, కథలోని గొప్పతనం వల్ల నచ్చుతాయి. ఇది సినిమాకే కాదు, అన్ని విజువల్ ఆర్ట్స్‌కీ వర్తిస్తుంది."

"ఆరు కావొస్తుంది, అనఘ ఇంకా ఇంటికి రాలేదా?" వున్నట్టుండి భాను అడిగింది.

"ఇవాళ స్నేహితులతో కలిసి యేదో సినిమాకి వెళ్తానంది. వాళ్ళు సినిమానించి ఇంటి దగ్గర దింపేస్తారట," బాహుబలి సినిమా శ్రద్ధగా చూస్తున్న సుమిత్ర చెప్పింది.

"దీనికి స్నేహితులు లేనప్పుడే బాగుండేది. ఇప్పుడు స్నేహితులెక్కువై, అసలు ఇంటిపట్టునే వుండటం లేదు." కుక్కర్లోంచి పప్పు తీసి పోపులో వేసి, చపాతీల కోసం పిండి తడుపుతూ అంది భాను.

"నువ్వు రొట్టెలు రోల్ చేసి ఇవ్వు, నేను కాలుస్తాలే అమ్మా!" భార్గవ్ వంటింట్లోకొచ్చి తల్లి చేతిలో పని అందుకుంటూ అన్నాడు. అశోక్ కొంచెం కొబ్బరి నూనె చేతిలోకి తీసుకొని సుమిత్ర పక్కన కింద కూర్చొని ఆమె మోకాళ్ళు మర్దన చేయడం మొదలు పెట్టాడు.

"అమ్మకి ఇవాళ మోకాళ్ళ నొప్పి బాగా ఎక్కువగా వుంది. పెయిన్ కిల్లర్స్ కూడా పెద్దగా పని చేయడం లేదు!" భానూతో చెప్పాడు.

తలుపు తోసుకొని వొచ్చింది అనఘ. పొట్టి స్కర్టూ, చిన్న టాపూ, వొదిలేసిన జుట్టూ, పదమూడేళ్ళ చిన్న పిల్ల పదహారేళ్ళ యువతిలా కనిపించడానికి చేసే ప్రయత్నంలా వుంది.

"యేం సినిమాకెళ్ళారు అనూ?" భార్గవ్ అడిగాడు.

"సినిమా ప్రోగ్రాం కేన్సిల్ అయింది. వూరికే రెస్టారెంటులో కూర్చొని చాట్ తిని వొచ్చాం."

"ఇంటికెవరితో వొచ్చావు?" భాను అడిగింది.

"రోషినీ, వాళ్ళ అన్నయ్య రతన్, వాళ్ళ కార్లో వచ్చాను."

"వాళ్ళెవరు? మీ క్లాసు అమ్మాయిలతో కాదా సినిమా?"

"అబ్బ, యూ ఆస్క్ టూ మెనీ క్వెస్చన్స్ మమ్మీ! రోషినీ వాళ్ళు ఈ మధ్యనే మన కాలనీలోకొచ్చారు. వాళ్ళిద్దరూ ట్విన్స్. మా క్లాసులోనే చేరారు. వాళ్ళ కారు ఎంత బాగుంటుందో తెలుసా? యూ కాంట్ ఇమేజిన్!"

"ఇంకోసారి మమ్మీ అన్నావంటే చంపేస్తాను. అమ్మా అనలేవూ?"

"మా క్లాసులో అందరూ మమ్మీ డాడీ అంటారు. నేనొక్కదాన్నే అమ్మా, నాన్నా అంటాను. డు యూ నో హౌ క్రూడ్ ఇట్ ఈజ్?"

"అనూ! నువ్వెళ్ళి ఆ బట్టలు మార్చుకొని రా. చపాతీలు తిందువుగాని. అమ్మా, ఇవాల్టికి లీవ్ హెర్ అలోన్. రేపు మాట్లాడదాం. అందరం బాహుబలి చూస్తూ చపాతీలు తిందాం." భార్గవ అందరినీ టీవీ ముందుకి చేర్చాడు.

★★★★★★★★★★

## 2016-అక్టోబరు

"భానూ! నువ్వు ఎక్కువ టెన్షన్ పడీ, గాభరా పడనంటే ఒకవిషయం చెప్తాను." అశోక్ మెల్లిగా అన్నాడు.

"యేమిటి?" లాప్‌టాప్ మూసేస్తూ అడిగింది భాను.

"అనూకి స్కూల్లో మార్కులు తగ్గుతున్నాయి. ఇప్పుడంటే తొమ్మిదో తరగతే కాబట్టి పెద్దగా కంగారక్కర్లేదనుకో. అయినా క్లాసు టీచరు ఒకసారి రమ్మంది మనిద్దరినీ. శనివారం నీకు తీరిక వుంటే వెళ్ళొద్దాం."

"అలాగే. ఎప్పుడూ లేనిది దానికి చదువుపైన శ్రద్ధ తగ్గిందా?"

డల్‌గా అన్నది భాను.

"చదువు మాటేమో కానీ, కొత్త స్నేహితులు ఎక్కువయ్యారు. ఎలాగైనా వాళ్ళలో కలిసిపోవడానికి చాలా ప్రయత్నిస్తుంది."

"పోనీలే, స్నేహితులు లేని ఒంటరితనం కన్నా, ఈ సమస్య పరవాలేదు."

"కానీ ఆ స్నేహితులు మన పరిస్థితులకీ, మనస్తత్వాలకీ ఏ మాత్రం సరిపడేటట్టుగా లేరు. అలాగని మనం వాళ్ళని ఎక్కువగా విమర్శిస్తే దానికి మనపై నమ్మకం పోతుంది."

"ఇద్దరమూ ఇంతింత చదువుకున్న వాళ్ళం, పధ్నాలుగేళ్ళ పిల్లని సంబాళించుకోలేక పోతున్నాం."

"అది మన తప్పు కాదు. డబ్బూ, డబ్బు వల్ల వచ్చే సూఖాలూ సరదాలూ బయట అదుపులేకుండా కుప్పతెప్పలుగా కనిపిస్తున్నాయి. ఆ ఆకర్షణలనుంచి పిల్లలని కాపాడుకోవడం కష్టమైన పనే మరి."

"అవును అశోక్. మనం పెరిగేటప్పుడు లైఫ్ ఇంత క్లిష్టంగా వుండేది కాదు."

"నాకూ అప్పుడప్పుడు అలాగే అనిపిస్తుంది. అసలు పిల్లలని పెంచుకోవడమే కాదు, జీవితంలో అన్ని కోణాల్లోనూ ఏదో అర్థం కాని సంక్లిష్టత పెరిగింది. యూనివర్సిటీ పిల్లల్లో రాజకీయ చైతన్యం కంటే కులాల స్పృహ ఎక్కువైంది. రాజకీయాలకీ కుల–మతాలకీబంధం ఇంకా దృఢమైంది. అంతెందుకు,మనిద్దరిదీ ఒకటే కులం కాదు. అయినా హాయిగానే వున్నాం. ఇప్పుడు విద్యార్థులని చూస్తుంటే అది సాధ్యమయేలా లేనేలేదు. పోనీ డిపార్ట్మెంటులో ఏమైనా ఉత్సాహంగా వుంటుందా అంటే, అదీ లేదు. ఎదుగూ బొదుగూ లేకుండా యేళ్ళ తరబడి ఒకే చోట యెలా వుంటాం? నలభై అయిదేళ్ళొచ్చాయి నాకు.చిన్నప్పటి చురుకుదనమూ, సంతోషమూ యెటు మాయమయ్యాయో తెలియటం లేదు! నీకూ, నీ వృత్తిలో ఇంకో రకం వొత్తిడి. ఆ పైన ఇద్దరు పిల్లలూ, ఇద్దరు పెద్దలూ! అలసటగా అనిపించడం లేదూ?"

భాను నిటారుగా లేచి నిలబడింది.

"అలసటగానే వుంది.కానీ ఇదేగా మనం కావాలనుకుంది? మనదంటూ ఒక ఇల్లు, మన పిల్లలూ, అత్తయ్యా, మా అమ్మా–నాన్నా, వాళ్ళని చూసుకుంటూ మనం..."

"యేమో, మనం కోరుకున్నామా లేకపోతే మన ప్రమేయం లేకుండా ఈ బధ్యతలన్నీ వాటంతటవే మనని చుట్టుముట్టాయా?"

భాను యేమీ మాట్లాడలేదు. వాళ్ళ చుట్టు రాత్రి నిశ్శబ్దంగా పరుచుకుంది. ఆశలూ, బాధ్యతలూ, కోరికలూ, కలలూ అన్నీ నిండిన మధ్య వయసులాటి బరువైన రాత్రి!

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS